సాక్షి మంచిర్యాల

గురువారం । 20 । జూలై । 2023



101 ఫోన్లు రికవరీ

పోలీసుల విస్తృత ప్రచారంతో సీఈఐఆర్ పోర్టల్‌పై ప్రజల్లో అవగాహన పెరిగింది. సామాన్యులకూ అందుబాటులోకి రావడంతో ఫోన్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తున్నారు. 8లో▸



అద్దె భవనంలోనే ఈఎస్ఐ ఆస్పత్రి

మంచిర్యాలలో ఈఎస్ఐ ఆస్పత్రి అద్దె భవనంలో కొనసాగుతోంది. దీంతో సరైన సౌకర్యాలు లేక పోవడంతో కార్మికులు, కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జైపూర్ ఏసీపీగా మోహన్ బాధ్యతల స్వీకరణ



మోహన్

జైపూర్: జైపూర్ అసిస్టెంట్ కమిషనర్ పోలీస్(ఏసీపీ)గా బలుసాని మోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసిన గోపతి నరేందర్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏసీపీగా రామగుండం కమిషరేట్ ఎస్‌బీలో పనిచేస్తున్న మోహన్ వచ్చారు. ఈ మేరకు ఆయన అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఐఈవో శైలజ తెలిపారు. 2003–24 విద్యా సంవత్సరానికి సబ్జెక్టుల్లో బోధించడానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24లోపు డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని పేర్కొన్నారు. మంచిర్యాల జూనియర్ కళాశాలలో హిందీ, మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, కామర్స్, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), మందమర్రి కళాశాలలో ఇంగ్లిష్, హిందీ, గణితం, బోటనీ, జువాలజీ, ఎకనామిక్స్, కామర్, ఈటీ, ఎంఎల్‌టీ, ఆర్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కాసిపేటలో గణితం, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), ఈటీ, చెన్నూర్‌లో కెమిస్ట్రీ, జువాలజీ, సివిక్స్, హిస్టరీ, బెల్లంపల్లి బాలికల కళాశాలలో హిందీ, కెమిస్ట్రీ, బోటనీ, బెల్లంపల్లి బాలుర కళాశాలలో జువాలజీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), ఎంఎల్‌టీ, సీఎస్, జైపూర్‌లో గణితం, జువాలజీ, జన్నారంలో ఇంగ్లిష్, దండేపల్లిలో ఇంగ్లిష్, జువాలజీ, లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ, హిస్టరీ, సివిక్స్, ఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

జైపూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పల్లెల్లో విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. జైపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే 35ఏళ్లు దాటిన రోగులకు తప్పనిసరిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. గర్భిణుల నమోదు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. వానాకాలం కావడంతో విషజ్వరాలు, పలు రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు ఎప్పటికప్పుడు వేడివేడి ఆహార పదార్థాలు తినాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయనిర్మల, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సదరం శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

నస్పూర్: ఈ నెల 25, 26, 27వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం పొందడానికి మీ–సేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో సదరం శిబిరానికి హాజరు కావాలని పేర్కొన్నారు. సదరం ధ్రువపత్రం కాలపరిమితి ముగిసిన వారు నూతనంగా ధ్రువపత్రం పొందాలని తెలిపారు. ఈ నెల 25న కంటి చూపు 30 మందికి, 26న శారీరక దివ్యాంగులు ఆర్థో 50 మందికి, 27న మూగ చెవుడు 50 మందికి, మానసిక వికలాంగులు 50 మందికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు సకాలంలో శిబిరానికి హాజరై ధ్రువీకరణ పత్రం పొందాలని తెలిపారు.

వర్షపాతం.. ఇంకా లోటే!



మండలాల వారీగా వర్ష పాతం సూచించే జిల్లా పటం



ఎల్లంపల్లి ప్రాజెక్టు

- జిల్లాలో 13 మండలాల్లో సాధారణ స్థాయికి..
- రైతులకు ఊరటనిస్తున్న వర్షాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు భారీ ఊరట కలుగుతోంది. అయినప్పటికీ జిల్లాలో ఇంకా సాధారణం కంటే లోటు వర్షపాతమే నమోదవుతోంది. ఈ వానాకాలంలో గత జూన్ రెండో వారం నుంచే వర్షాలు కురవాల్సి ఉన్నా ఆలస్యమైంది. చాలా చోట్ల రైతులు విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురుచూశారు. ఇక వరి నార్లు పోసేందుకు కూడా వెనుకడుగు వేశారు. మొదట ఆశించిన వర్షాలు పడక ఆందోళన చెందారు. ప్రస్తుతం కురుస్తున్న వానలకు రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికీ కొన్ని చోట్ల నారు పోయలేదు. చెరువుల కింద సాగు చేస్తున్న వారంతా వర్షాల కోసమే ఎదురు చూస్తున్నారు. ఇప్పటికీ జిల్లాలో ఇంకా లోటు వర్షపాతమే నెలకొంది. చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండలేదు. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు పెన్‌గంగా, వెన్‌గంగాలకు వరద ఉధృతి పెరిగింది. దీంతో ప్రాణహిత నదికి వరద ఎక్కువగా వస్తోంది. గత మూడు రోజులుగా నది నీటిమట్టం పెరిగి ప్రవహిస్తోంది. గోదావరి తీరంలో నీరు చేరుతోంది. ప్రస్తుతం అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, బ్యారేజీల గేట్లు మూసివేయడంతో నదిలో నీటి నిల్వ పెరుగుతోంది.

రెండు రోజులుగా వర్షాలు..

ఈ సీజన్ ప్రారంభం అంటే వానాకాలం మొదలయ్యే జూన్ మొదటి వారం నుంచి వర్షాలు ఆశాజనకంగా కనిపించలేదు. మూడో వారం వరకు వర్షాలు జాడలేవు. గత మూడో వారంలోనే వర్షాలు మొదలయ్యాయి. ఇక జూన్ మొదటి వారం నాటికి జిల్లాలో 28శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూలై రెండో వారం సాధారణంలో సగం వర్షపాతం నమోదు కాగా, మూడో వారం నాటికి వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో బుధవారం నాటికి సగటు సాధారణ వర్షపాతం లెక్కిస్తే ఇంకా ఏడు మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో కన్నెపల్లి, వేమనపల్లి, నెన్నెల మండలాలు లోటు వర్షపాతంలో ఉన్నాయి. జైపూర్ మండలం ఒక్కటే సాధారణం కంటే అధికంగా వర్షపాతం నమోదైంది. మిగతా మండలాలు మాత్రం సాధారణ వర్షపాతం నమోదయ్యాయి. దీంతో అన్నదాతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నిలకడగా ప్రాణహిత

వేమనపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తోంది. గత రెండు రోజులుగా వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. దిగువన మేడిగడ్డ వద్ద లక్ష్మీ బ్యారేజ్‌లో 35 గేట్ల ద్వారా నీళ్లను వదులుతుండగా ఎగువ నుంచి వస్తున్న వరద కిందికి వెళ్లలేకపోతోంది. దీంతో వేమనపల్లి పుష్కరఘాట్ మెట్లపై నుంచి వరద వెళ్తుండగా లోతట్టు ప్రాంతాల్లోని పత్తి పంటకు వరద ప్రమాదం పొంచి ఉంది.

ఈ సీజన్‌లో ఈ నెల 19వరకు కురిసిన వర్షపాతం(మిల్లీమీటర్లు)

మండలం	కురిసింది	సాధారణం	స్థితి
జన్నారం	362.9	384.9	సాధారణం
దండేపల్లి	287.1	327.9	సాధారణం
లక్సెట్టిపేట	231.4	337.4	లోటు
హాజీపూర్	282.2	344.0	సాధారణం
కాసిపేట	353.3	331.7	సాధారణం
తాండూరు	287.7	308.2	సాధారణం
భీమిని	294.9	364.8	సాధారణం
కన్నెపల్లి	279.3	366.9	లోటు
వేమనపల్లి	293.5	370.9	లోటు
నెన్నెల	245.5	342.7	లోటు
బెల్లంపల్లి	333.1	315.4	సాధారణం
మందమర్రి	286.7	324.5	సాధారణం
మంచిర్యాల	308.0	335.9	సాధారణం
నస్పూర్	344.6	335.0	అధికం
జైపూర్	441.5	350.0	సాధారణం
భీమారం	351.5	340.0	సాధారణం
చెన్నూరు	411.3	361.4	సాధారణం
కోటపల్లి	379.0	338.9	సాధారణం
సగటు	320.7	343.4	సాధారణం

బుధవారం కురిసిన వర్షపాతం 15.7మి.మీ.



పూర్తి నీటిమట్టంతో ర్యాలీవాగు ప్రాజెక్ట్

'ప్రాణహిత' పరవళ్లు.. గోదావరికి వరద



ఎర్రాయిపేట వద్ద గోదావరి నది ప్రవాహం

కోటపల్లి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలో సరిహద్దుగా ఉన్న ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. వెంచపల్లి, జనగామ, ఆలుగామ గ్రామాల సరిహద్దుగా ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రాపన్‌పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర వంతెనపై వచ్చిపోయే ప్రయాణికులు ప్రాణహిత ఉగ్రరూపాన్ని సెల్‌ఫోన్‌తో సెల్ఫీలు దిగుతున్నారు. ఎర్రాయిపేట, రాంపూర్, కొల్లూర్ గ్రామాల సరిహద్దుగా ఉన్న గోదావరి నదిలో రోజురోజుకు నీటిమట్టం పెరుగుతోంది. కాళేశ్వరం అన్నారం బ్యారేజీ, కడెం ప్రాజెక్టు నీటిని వదలండంతో నీటిమట్టం రాత్రి వరకు మరింత పెరిగి ఉగ్రరూపం దాల్చే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. నదుల్లోకి చేపలు పట్టడం, పడవలపై ప్రయాణం చేయకూడదని, అత్యవసమైతే తప్పా ఇంట్లో నుంచి బయటికి రావద్దని నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్క సుమన్ సూచించారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకరావాలని కోటపల్లి ఎస్సై సురేశ్ కోరారు.

ఎల్లంపల్లికి..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు హాజీపూర్ మండలం ముల్కల్ల ర్యాలీవాగు ప్రాజెక్ట్, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ జలకళను సంతరించుకున్నాయి. ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను బుధవారం రాత్రి వరకు 15.150 టీఎంసీల నీటిమట్టానికి చేరింది. ఇన్‌ఫ్లో 3,369 కూసెక్కుల వరద వస్తోంది. ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు, నంది పంప్‌హౌజ్‌కు 12,600 క్యూసెక్కులు వదులుతున్నారు. ర్యాలీవాగు ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టంతో నిండుకుండలా మారింది. 408.588 మిలియన్ క్యూబిక్ ఫీట్ల పూర్తి నీటి మట్టంతో ఉంది. ఇన్ ఫ్లో కింద 10 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేయాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధికి ఉద్యానవన, వ్యవసాయ, ఉపాధిహామీ పథకం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి ఉద్యానవన, వ్యవసాయ శాఖ, మండల పరిషత్ అభివృద్ధి, మండల పంచాయతీ, సాంకేతిక సహాయకులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సాగు నీటి సౌకర్యం గల చిన్న, సన్నకారు రైతులు ఉద్యానవన పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ, మిగతా వారికి 90 శాతం రాయితీతో మొక్కలు అందిస్తామని వివరించారు. వివిధ రకాల పండ్ల మొక్కలతోపాటు డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు అందిస్తామని తెలిపారు. జిల్లాకు కేటాయించిన 1,467 ఎకరాల లక్ష్యాన్ని ఆగస్టు మాసాంతం వరకు పూర్తి చేయాలని తెలిపారు. ఐదెకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులను ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ ఏడాదికి నిర్దేశించిన 3,400 ఎకరాల లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు.

వాహనాల పంపిణీకి దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వాహనాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి డి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. చేపల పరిశ్రమకు సంబంధించిన రాయితీతో కొత్త చేపల చెరువుల నిర్మాణం, మంచినీటి చేపల హ్యాచరీ చేపట్టవచ్చని పేర్కొన్నారు. మొబైల్ క్యాంటీన్ ద్వారా విక్రయించడానికి నాలుగు, మూడు చక్రాల వాహనాలు రాయితీపై మంజూరు చేస్తామని తెలిపారు. మత్స్యశాఖ సంఘాల సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 60 శాతం, సాధారణ కేటగిరీ వారికి 40 శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

'నులి'పేద్దాం

- నులి పురుగులతో చిన్నారులకు అనారోగ్యం
- నేడు జిల్లాలో మాత్రల పంపిణీ

జిల్లాలో..

1నుంచి19ఏళ్ల పిల్లలు	1,94,282
ప్రభుత్వ హాస్టళ్లు	92
అంగన్‌వాడీ కేంద్రాలు	969
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు	954
ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు	48
ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	27



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: బహిరంగ మల, మూత్ర విసర్జన చేయడం, చెప్పులు వేసుకోకుండా తిరగడం, ఆడుకోవడం, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడంతో పిల్లలు కడుపునొప్పి, విరేచనాల బారిన పడుతుంటారు. చిన్నారుల పొట్టలో తిష్టవేసి పోషకాలు, ఆరోగ్యాన్ని హరించే నులి పురుగుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినా, జాగ్రత్తలు తీసుకోకపోయినా ప్రాణాంతకంగా మారవచ్చని అంటున్నారు. ఇలాంటి రుగ్మతల నివారణకు ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినం నిర్వహిస్తున్నారు. నులి పురుగుల నివారణకు 1నుంచి 19ఏళ్లలోపు పిల్లలకు మాత్రల పంపిణీ చేపడుతారు. ఆ రోజు మాత్రలు తీసుకోని వారికి 27న వేయనున్నారు. నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో వేసేందుకు పంపిణీ చేశబూరు. అవగాహనకు సంబంధించిన పోస్టర్లను బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, డాక్టర్ నీరజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయపూర్ణిమ, డాక్టర్ ఫయాజ్‌ఖాన్ విడుదల చేశారు.

మాత్రలు చప్పరించి మింగాల్సిందే..

జిల్లాలోని 1–19ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్‌బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రను మధ్యాహ్న భోజనం తర్వాత అందించనున్నారు. రెండేళ్లలోపు పిల్లలకు అరమాత్ర, రెండు నుంచి 19ఏళ్లలోపు వారికి ఒక పూర్తి మాత్రను చప్పరించి మింగించాలి. ఇది నేరుగా మింగే మాత్ర కాదు, నోట్లో వేసుకుని చప్పరిస్తే సరిపోతుంది. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు మాత్రలను అందించేలా వైద్యులు ఏర్పాట్లు చేశారు.

నులి పురుగులు అంటే..

పిల్లల్లో మూడు రకాల క్రిములు ఏలిక పాములు, నులి పురుగులు, కొంకి పురుగులు ఉంటాయి. నులిపురుగులు మానవుల్లోని ప్రేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు. ఇవి పిల్లలు ఆరుబయట ఆడుకోవడం, చేతులు కడుక్కోకుండా ఆహారం భుజించడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన, అపరిశుభ్ర పరిసరాలతో నులిపురుగుల చిన్నారుల చెంతకు చేరుతాయి. నులిపురుగులు కలిగిన చిన్నారులు, నులి పురుగుల గుడ్లు కలిగిన మలంతో నేలను కలుషితం చేస్తారు. ఈ గుడ్లు నేలలో లార్వాలుగా వృద్ధి చెందుతాయి. మిగతా పిల్లలు ఆరుబయట మట్టిని ముట్టడం, లేదా ఈ నులిపురుగుల గుడ్లు చేరిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఇతర పిల్లల కడుపులోకి వెళ్లి అక్కడ వృద్ధి చెంది తిష్టవేస్తాయి. 19 ఏళ్లలోపు చిన్నారుల ఆరోగ్యంపై ఈ నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపుతాయి.

సమస్యలు తప్పవు

నులిపురుగులు కలిగిన చిన్నారులు తినే ఆహారం పేగుల్లోకి చేరినప్పుడు రక్తంలోకి చేరాల్సిన పోషకాలను నులిపురుగులు పీల్చుకోవడంతో ఎదుగుదల నిలిచిపోయి రోగాల బారిన పడుతారు. ఆకలి మందగించి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. రక్తహీనత, పోషకాహార లోపం బారిన పడతారు. ఆకలి లేకపోవడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, అతిసారం, మలంలో రక్తం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

చిన్నారులందరికీ మాత్ర వేయాలి



నులి పురుగుల నివారణకు పరిశుభ్రతనే తప్పనిసరి. చిన్నారులు తగిన జాగ్రత్తలను తీసుకోవాల్సిందే. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం మానుకోవాలి. ఆహారంపై ఈగలు, దోమలు, కీటకాలు వాలకుండా చూడాలి. పండ్లు, కూరగాయలను శుభ్రమైన నీటితో కడిగి వండుకోవాలి. స్వచ్ఛమైన నీటినే తాగాలి. చేతి గోర్లను చిన్నగా కత్తిరించుకుని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మలవిసర్జన తర్వాత, భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కాళ్లకు తప్పనిసరిగా చెప్పులు గానీ, బూట్లు గానీ ఉంటేనే బయటకు వెళ్లాలి.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి, మంచిర్యాల

'కాంగ్రెస్ పాలనలో తీవ్ర సంక్షోభంలో వ్యవసాయం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: ఐదు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. రైతులకు ఉచిత కరెంటుపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీతారాంపల్లి రైతువేదిక వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దివాకర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు కరెంటు, ఎరువులు, నీళ్లు ఇవ్వకుండా, ప్రాజెక్టులు కట్టకుండా, చెరువులను బాగు చేయకుండా వ్యవవసాయాన్ని అధోగతి పాలు చేసి ఆత్మహత్యలకు కారణమైందని ఆరోపించారు. రైతులకు మూడు గంటల విద్యుత్ చాలు అన్న రేవంత్‌రెడ్డి బేషరతుగా తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్ వంగ తిరుపతి, పట్టణ ఉపాధ్యక్షుడు నౌండ్ల సంతోష్‌చారి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు గరిశ రామస్వామి, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చిచ్చుకు కాంగ్రెస్ కుటిల యత్నాలు

- రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి
- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి/నెన్నెల: రాష్ట్రంలో ఉన్న ప్రశాంతతను చెరిపేసి చిచ్చు రేపేందుకు కాంగ్రెస్ పార్టీ కుటిల యత్నాలు చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. బుధవారం బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల, నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామాల్లోని రైతువేదికల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు రైతాంగాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని, వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, అందుబాటులో ఎరువులు, విత్తనాలు అందిస్తున్న ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో గడ్డం వినోద్ రూ.కోట్లు ఖర్చు చేసినా గెలవలేకపోయారని, వివేక్ ప్రాతినిధ్యం వహించిన పెద్దపల్లి, చెన్నూర్‌లలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కనీసం పైపుల ఫ్యాక్టరీనైనా ఏర్పాటు చేయలేక పోయారని విమర్శించారు. ఈ సదస్సుల్లో జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గణేష్‌గౌడ్, ఎంపీటీసీలు సుభాష్‌రావు, శకుంతల, నెన్నెల ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, సహకార సంఘం చైర్మన్ మేకల మల్లేష్, ఆత్మ చైర్మన్ సున్నం రాజు, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు కలిసికట్టుగా ఉండాలి

- జిల్లా అధ్యక్షుడు రఘునాథ్
- టిఫిన్ బైఠక్ సమావేశం



బెల్లంపల్లిలో నాయకుల సహపంక్తి భోజనాలు

బెల్లంపల్లి: బీజేపీ కార్యకర్తలు కలిసికట్టుగా ఉండాలని, వచ్చే ఎన్నికల్లో ఆయా పార్టీలను చిత్తుగా ఓడించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వి.రఘునాథ్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం బెల్లంపల్లిలోని వైశ్యభవన్‌లో టిఫిన్ బైఠక్ సమావేశం నిర్వహించారు. బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల శ్రేణులు టిఫిన్ బాక్సులతో హాజరై సహపంక్తి భోజనాలు చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీరు, బిర్యానీలతో సమావేశాలు నిర్వహిస్తుంటే.. బీజేపీ సంస్కృతి, సంప్రదాయాలతో కార్యకర్తలు ఎవరికి వారు టిఫిన్ బాక్సులు తెచ్చుకుని అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసి భోజనం చేయాలని పిలుపునివ్వడం ఎంతో ఉన్నతమైందని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి సుదర్శన్‌గౌడ్, పార్టీ మున్సిపల్, మండలాల అధ్యక్షులు కోడి రమేష్, రాజ్‌కుమార్, మహీధర్‌గౌడ్, సత్యనారాయణ, రామన్నయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాగిడి చిరంజీవి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్‌లో..

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో బుధవారం బీజేపీ నాయకులు టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు టిఫిన్ బాక్సులు వెంట తెచ్చుకుని సహపంక్తి భోజనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ రామకృష్ణాపూర్ పట్టణంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, నగునూరి వెంకటేశ్వర్, అక్కల రమేష్, ఆరుముళ్ల పోషం, దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం 4, 5వ తరగతి విద్యార్థులకు ఇటీవల జిల్లాలో నిర్వహించిన క్రీడల్లో పలువురు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, ఈ నెల 23న ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న డీవైఎస్‌వో కార్యాలయంలో రిపోర్టు చేయాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జనన, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, పది పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలు, 3, 4వ తరగతికి చెందిన ప్రోగ్రెస్ రిపోర్టులు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు 24, 25వ తేదీల్లో హైదరాబాద్ హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తారని తెలిపారు.

ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలకు 4వ తరగతికి బాలికలు గంధం జశ్విత(మన్నెగూడ, జన్నారం), అర్రె రోజారాణి(దొంగపల్లి, జన్నారం), భోగ్యం లలిత (బెల్లంపల్లి), బాలురులో సీపతి హర్షవర్ధన్(కొండాపూర్, దండేపల్లి), జంబోజి రాంచరణ్(ఎల్లారం, దండేపల్లి), పొన్నం శ్రీజన్ గౌడ్(రామకృష్ణాపూర్), గంధం రిశ్వంత్(మన్నెగూడ, జన్నారం), ఆననదాని మహోన్నత్(శ్రీరాంపూర్) ఎంపికయ్యారు. 5వ తరగతిలో బాలికలు కొకెర్ల లక్ష్మీప్రసన్న(రేండ్లగూడ, జన్నారం), జైనేని మౌనిక(దొంగపల్లి, జన్నారం), కొర్రె హరిణి(శ్రీరాంపూర్), బాలురలో బండారి రక్షిత్(మందమర్రి), ఏ.తేజేశ్(గంగారం), బానవత్ అభినయ్(లింగాపూర్, దండేపల్లి), అక్కల రిశ్వంత్ (కంచపల్లి, చెన్నూరు), రాంటెంకి రాజా వంశీ(అలగం, కోటపల్లి) ఎంపికయ్యారు.

క్లుప్తంగా

హత్య కేసులో ఒకరికి పదేళ్ల జైలు

దండేపల్లి(మంచిర్యాల): హత్య కేసులో ఒకరికి పదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తు కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. దండేపల్లి మండలం కనెనపల్లి శివారులోని ఓ పౌల్ట్రీ ఫాం వద్ద 2017 సెప్టెంబర్ 20న తిరుపతి అనే వ్యాన్ క్లీనర్‌ను, పౌల్ట్రీఫాంలో పనిచేసే అశోక్ హత్యచేశాడు. నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ పూర్తి కావడంతో నిందితుడు అశోక్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మంచిర్యాల సెషన్ కోర్టు జడ్జి ప్రభాకరరావు బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరికి ఏడాది జైలు

నస్పూర్(మంచిర్యాల): దాడి కేసులో ఒకరికి ఏడాది జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వాని తీర్పునిచ్చినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. మంచిర్యాలలోని చున్నంబట్టి వాడకు చెందిన బాలకృష్ణ 24 డిసెంబర్ 2015న తనను అకారణంగా తిట్టి గాయపర్చాడని పట్టణ పరిధిలోని ఫ్లడ్ కాలనీకి చెందిన మండ రవి సీసీసీ నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహిన్ సుల్తానా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైతీర్పుని వెలువరించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష

మందమర్రిరూరల్(చెన్నూర్): నిర్లక్ష్యంగా లారి నడిపి ఒకరి మృతికి కారణమైన మహమ్మద్ యాసిన్‌కు శిక్ష ఖరారు చేస్తూ జిల్లా ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉపనిషద్వని తీర్పునిచ్చినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. 29 అక్టోబర్ 2017న శ్రీనివాస్, మరో ఇద్దరు మోటార్ సైకిల్‌పై పాత బస్టాండ్ వైపు వెళ్తుండగా మహమ్మద్ యాసిన్ అతివేగంగా లారీ నడుపుతూ ఢీకొట్టడంతో శ్రీనివాస్ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీనివాస్ కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద మందమర్రి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహిన్‌సుల్తానా సాక్షులను ప్రవేశపెట్టగా ఐపీసీ సెక్షన్ 304 (ఏ)కింద 18 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా, ఐపీసీ సెక్షన్ 337 కింద ఐదు నెలల సాధారణ శిక్షతో పాటు రూ.500ల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చినట్లు ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

రామకృష్ణాపూర్(చెన్నూర్): మందమర్రి పట్టణానికి చెందిన గోమాస జయంత్‌కుమార్, స్థానిక నాగార్జునకాలనీకి చెందిన పెరుగు రాజశేఖర్ ఐదు రోజుల క్రితం సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్సై అశోక్ బాధితులకు ఫోన్లను అప్పగించారు.

రూ.100కే రెండు కేజీల చేపలు



అమ్మకానికి పెట్టిన అలుగు చేపలు

నెన్నెల(బెల్లంపల్లి): మండల కేంద్రంలోని బ్యాంకు సమీపంలో బుధవారం రూ.100 కే రెండు కిలోల చేపలు విక్రయించడంతో కొనుగోలు చేసేందుకు మత్స్యప్రియులు ఎగబడ్డారు. కన్నెపల్లి మండలం సాలిగామ ప్రాజెక్టు నుంచి బొలెరో వాహనంలో మత్స్యకారులు తీసుకువచ్చిన ఐదు క్వింటాళ్ల చేపలు గంట వ్యవధిలోనే అమ్ముడుపోయాయి. రూ.200లకు కేజీ ధర పలికే చేపలు రూ.100కే రెండు కిలోలు రావడంతో పోటీపడి కొనుగోలు చేశారు.

141 రోజులు.. 101 ఫోన్లు రికవరీ

పట్టణంలోని రాంనగర్‌కు చెందిన కోవ శ్రావణ్ గత నెల 30న తమ ఇంటికి వెళ్లే మార్గంలో ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులు పదిహేను రోజుల వ్యవధిలోనే ఫోన్ ఆచూకీ కనుగొన్నారు. ఈ నెల 13న స్థానిక సీఐ రాజు చేతుల మీదుగా బాధితునికి ఫోన్ అప్పగించారు.

- సీఈఐఆర్ పోర్టల్‌పై పెరిగిన అవగాహన
- పోలీసుల విస్తృత ప్రచారం
- సామాన్యులకు సైతం అందుబాటులోకి...



బాధితునికి ఫోన్ అప్పగిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: జిల్లాలో రోజురోజుకూ సెల్‌ఫోన్ల చోరీలు పెరిగిపోతున్నాయి. ఫోన్ పోగొట్టుకున్న బాధితులంతా పోయిన ఫోన్ కంటే అందులో ఉండే డాటా కోసం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో విద్య, వ్యాపారం, ఉద్యోగం, ఆరోగ్యం, బ్యాంకింగ్, రాజకీయ సమావేశాలు.. ఇలా ఎన్నో రకాల సమాచారాన్ని ఫోన్ల ద్వారానే నిర్వహిస్తున్నారు. కరోనా తరువాత సెల్‌ఫోన్ వినియోగం బాగా పెరిగింది. కూరగాయలు మొదలుకుని రూపాయి చాక్లెట్ వరకు కొనుగోలు చేయాలంటే సెల్‌ఫోన్ ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి. విద్యార్థుల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. అంతే కాకుండా పలువురు తమ వ్యక్తిగత సమాచారం పలు సాఫ్ట్ కాపీల రూపంలో ఫోన్‌లోనే భద్రపర్చుకుంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవునికి నిత్యజీవితంలో ఫోన్ కీలకంగా మారింది.
ఇంతటి కీలకమైన ఫోన్ పోగొట్టుకున్నా..లేక చోరీకి గురైతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారా? ఫోన్ పోయిన వారు ఇకనుంచీ భయపడాల్సిన అవసరం లేదు. పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ ఆధ్వర్యంలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ (సీఈఐఆర్)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పోయిన ఫోన్లు గుర్తించడంలో సీఈఐఆర్ పోర్టల్ కీలక పాత్ర పోషిస్తోంది. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఈ ఏడాది మార్చి 1న ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 689 దరఖాస్తులను పోర్టల్‌లో నిక్షిప్తం చేశారు. ఇందులో 101 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. సీఈఐఆర్ వెబ్ పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పోలీసులు సత్ఫలితాలు సాధిస్తున్నారు.

పోర్టల్‌పై అవగాహన కల్పిస్తున్నాం

సీఈఐఆర్ వెబ్‌పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే సోషల్ మీడియా, గోడ ప్రతుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 689 దరఖాస్తులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా 101 సెల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందజేశాం. ఫోన్ పోయిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వీలైనంత త్వరగా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులకు సీఈఐఆర్ పోర్టల్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం.
– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

అక్షరాలు నేర్వాలంటే..అడుసు తొక్కాల్సిందే!



మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ బురద మయంగా మారింది. విద్యార్థులు బడిలోకి రావాలంటే అడుసు(బురద) తొక్కాల్సిందే. పాఠశాల సమీపంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు పాత భవనం కూల్చడంతో దానికి సంబంధించిన ఇటుక పెళ్లలు పాఠశాల ఆవరణలో పోయడంతో వాటిని దాటేందుకు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల బురద కష్టాలు తీర్చేందుకు కనీసం మొరం పోయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.
– దండేపల్లి(మంచిర్యాల)

అద్దెభవనంలోనే ఈఎస్‌ఐ ఆస్పత్రి

- కార్మికులకు అందని వైద్యసేవలు
- పూర్తిస్థాయి వైద్యసేవలకు దూరప్రాంతాలకు వెళ్తున్న వైనం
- పక్కాభవనం నిర్మించాలని డిమాండ్




అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్‌ఐ ఆస్పత్రి

పాతమంచిర్యాల: జిల్లాలోని వివిధ కర్మాగారాలు, ప్రైవేటు కంపెనీలలో పనిచేసే కార్మికులకు ప్రభుత్వం ఈఎస్‌ఐ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలు అందిస్తోంది. ఇందుకు వారి వేతనాలలో కొంతమొత్తాన్ని ప్రభుత్వం జమ చేసుకుంటుంది. కార్మికుల వైద్య అవసరాలకు ఆ మొత్తాన్ని వినియోగిస్తుంది. బొగ్గు ఆధారిత పరిశ్రమలలో పని చేసేవారు, జైపూర్ పవర్‌ప్లాంట్, దేవాపూర్ సిమెంట్ కర్మాగారం, మట్టిపైపుల తయారీ పరిశ్రమలు, బ్రెడ్ కంపెనీ, హోటళ్లు, ఆటోమొబైల్, ఇతర పరిశ్రమలలో పని చేసే వారు ఈఎస్‌ఐ కార్డులు పొందుతారు. ఈఎస్‌ఐ కార్డులు కలిగి ఉన్న కార్మికులు జిల్లాలో ఎనిమిది వేలమంది ఉన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు వైద్యంకోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందే అవకాశం ఉంది. ప్రతిరోజు వైద్యంకోసం 60 నుంచి 80 మంది వరకు ఆస్పత్రికి వస్తున్నారు. కానీ జిల్లా కేంద్రంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రిలో కార్మికులకు వైద్యసేవలు అరకొరగానే అందుతున్నాయి. అద్దె భవనంలో కొనసాగుతున్న ఆస్పత్రిలో సరైన వసతులు లేక నామమాత్రంగా వైద్య సేవలు అందుతున్నాయని కార్మికులు వాపోతున్నారు. కేవలం ఓపీ సేవలు మాత్రమే అందుతున్నాయని, బెడ్స్ లేకపోవడంతో ఎమర్జెన్సీ కేసులను జిల్లా కేంద్రంలోని, కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల బారిన పడినవారు, గుండె, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రికి వస్తే ఇక్కడి వైద్యులు హైదరాబాద్‌లోని నాచారం ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. కాగా మందులు నిలువ చేసేందుకు సరిపడా గదులు లేకపోవడంతో వరండాలోనే నిలువ చేస్తున్నారు. అంతేకాకుండా రోగులు వేచి ఉండడానికి గదిలేకపోవడంతో వరండాలోనే కూర్చుంటున్నారు. కనీస వసతులు లేక రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆస్పత్రికి పక్కా భవనం నిర్మించి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదికలు పంపించాం

జిల్లా కేంద్రంలోని ఈఎస్‌ఐ ఆస్పత్రికి పక్కా భవనంలేక పదేళ్లుగా అద్దెభవనంలోనే కొనసాగుతోంది. భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. పక్కా భవనం నిర్మిస్తేనే ఆస్పత్రిలో వసతులు మెరుగుపడతాయి. – ఏ.రవీంద్రబాబు, వైద్యాధికారి, ఈఎస్‌ఐ ఆస్పత్రి, మంచిర్యాల

డిస్పెన్సరీలో మరమ్మతులు చేపట్టాలి



ఆస్పత్రిని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీ లోపల మరమ్మతులు చేపట్టాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం క్యాజువాలిటీ గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌రావు ఊడిపోయిన పైకప్పు పెచ్చులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్డింగ్ లోపల కాకుండా బయట మాత్రమే పనులు చేపట్టి లోపలి భాగాన్ని విస్మరించారన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయన్నారు. నీటి ట్యాంకులను శుభ్రం చేయటం, స్లాబుపై చెత్తా చెదారం తొలగించడం, సైడ్ గోడలకు చెమ్మ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని, మహిళలకు ప్రత్యేక టాయ్‌లెట్స్ ఏర్పాటు చేసి పురుషుల మరుగుదొడ్లను ఆధునీకరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

దసరాకు ముందు లాభాల వాటా పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

శ్రీరాంపూర్: రాబోయే దసరాకు ముందు సింగరేణి కార్మికులకు లాభాలవాటా పంపిణీ చేయడం జరుగుతుందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు తెలిపారు. బుధవారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి రూ.700 కోట్ల వాటాను కార్మికులకు పంచుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ నస్పూర్‌లో జరిగిన బహిరంగసభలో హామీ ఇచ్చారన్నారు. కోలిండియాలో లేని హక్కులను సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులకు కల్పించారన్నారు. కారుణ్య ఉద్యోగాల ద్వారా సుమారు 15వేల మందికి, ఎక్స్‌ట్రనల్ ద్వారా మరో 5 వేల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. కార్మికులు రూ.10 లక్షలు ఇంటి రుణం తీసుకుంటే వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారన్నారు. బేసిక్‌పై ఒకశాతం కరెంట్ బిల్లులు కార్మికులు చెల్లించేవారని, దీన్ని నేడు కేసీఆర్ పూర్తిగా రద్దు చేయించారన్నారు. రిటైర్మెంట్ వయస్సును కూడా ఏడాది పెంచారన్నారు. కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. 2022 నాటికి ఉద్యోగంలో చేరి 190/ 240 మస్టర్లు పూర్తి చేసిన బదిలీ వర్కర్‌ను నెల రోజుల్లో జనరల్ మాదిరిగా పర్మినెంట్ చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి చాట్ల అశోక్, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, జీఎం కమిటీ సభ్యులు వెంగల కుమారస్వామి, నాయకులు అశోక్, తొంగల రమేశ్, ల్యాగల శ్రీనివాస్, సత్యనారాయణ, అన్వేష్‌రెడ్డి, పిట్ సెక్రెటరీ మెండ వెంకన్న, జంపయ్య, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘చింతలమాదర’కు జలకళ



ఇటీవల కురిసిన వర్షాలకు చింతలమాదర జలపాతంకు జలకళ సంతరించుకుంది. బుధవారం నుంచి సందర్శకులకు అనుమతి ఇస్తున్నట్లు ఏకో టూరిజం కమిటీ చైర్మన్ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఈ జలపాతం వీక్షణకు ఏటా ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి సందర్శకులు వస్తుంటారు.
– తిర్యాణి(ఆసిఫాబాద్)

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

కేయూ క్యాంపస్ : తెలంగాణలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 20 (నేటి నుంచి) నుంచి ప్రారంభం కానున్న వివిధ విభాగాల్లోని పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన డీన్లు, విభాగాధిపతులు, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు, ఇతర అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరిన్ని వివరాలకోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు వెల్లడించారు.

మా కడుపులు కొట్టకండి..




ప్రైవేట్ కార్మికులకు దండం పెడుతున్న పంచాయతీ కార్మికులు

భీమిని(బెల్లంపల్లి): తమ డిమాండ్లు నెరవేర్చాలని 13 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. బుధవారం భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల్లో ప్రైవేట్ కార్మికులతో పనులు చేయించారు. దీంతో మా కడుపులు కొట్టవద్దంటూ దండం పెడుతూ కన్నెపల్లి మండలంలోని పారిశుధ్య కార్మికులు వేడుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామానికి చెందిన టేకం గణపతి, రెడ్డి ఇస్తారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ప్రభాకర్ తెలిపారు. దరోగపల్లి చెరువులో సభ్యత్వం లేని వారు చేపలు పడుతున్నారని చేడ్వాయి మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బోయిరే సోమన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి పట్టిన చేపలు, వలలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సాంకేతిక అంశాలపై పట్టు ఉండాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయులు సాంకేతిక అంశాలపై పట్టు కలిగి ఉండాలని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో గురుశాల(ప్రథమ్ ఫౌండేషన్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సాంకేతిక అంశాలపై మెలకువలు, బోధనాభ్యసన ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బోధనాభ్యసన ప్రక్రియలో డిజిటల్ ఉపకరణాల వినియోగానికి సమర్థవంతంగా చేసేందుకు శిక్షణ తోడ్పడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులకు సాంకేతికతను చేరవేసే బాధ్యతను భుజానికి ఎత్తుకున్న గురుశాల టీంను అభినందించారు. కోఆర్డినేటర్లు కె.చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, సహాయ గణాంక కో–ఆర్డినేటర్ రాజుకుమార్, గురుశాల సభ్యులు దుర్గేష్, తివారి, నీతూ, సృష్టి, మేఘన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాల కార్యదర్శిని కలిసిన ‘రేగుంట’



గురుకులాల కార్యదర్శి డాక్టర్ నవీన్ నికోలస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న లింగయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ రాష్ట్ర గురుకులాల నూతన కార్యదర్శిగా డాక్టర్ నవీన్ నికోలస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట లింగయ్య ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, నాణ్యమైన విద్యను అందించడం, పక్కా భవనాల ఏర్పాటు విషయంలో దృష్టి సారించాలని ఆయన కోరారు.

‘ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలి’



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రావు

నస్పూర్: ప్రైవేటు విద్యారంగ సంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ జిల్లా కన్వీనర్ రాపోలు విష్ణువర్ధన్‌రావు తెలిపారు. జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కో కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్‌తో కలిసి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్ని పార్టీలు తమ మేనిఫేస్టోల్లో చేర్చాలని, రాబోవు రోజుల్లో అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లను కలుస్తామని తెలిపారు. విద్యాసంస్థలు స్థాపించి పదిహేను ఏళ్లు పూర్తి చేసుకున్న వాటికి శాశ్వత గుర్తింపు ఇవ్వాలని, బస్సులకు టోల్‌టాక్స్ మినహాయింపు ఇవ్వాలని, సిబ్బందికి హెల్త్‌కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రైవేటు పాఠశాలల మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్ పాషా, నస్పూర్ పట్టణ అధ్యక్షులు సబిహాసుల్తానా, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ గోపతి సత్తయ్య, నాయకులు మోహన్‌వర్మ, విక్రమ్‌రావు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన రాజ్‌కుమార్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహన్

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాలబస్తీ కల్వర్టు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జాడి రాజ్‌కుమార్(35), రెబ్బెన మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బట్టి మోహన్ బెల్లంపల్లి బజారు ఏరియా నుండి తాండూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా తాండూర్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో రాజ్‌కుమార్ మృతి చెందగా మోహన్‌కు గాయాలు కావడంతో మంచిర్యాలకు తరలించారు. సంఘటనాస్థలిని బెల్లంపల్లి రూరల్ సీఐ ఎస్.రాజ్‌కుమార్‌గౌడ్, వన్‌టౌన్ ఏఎస్సై ఆర్.తిరుపతి సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి’

పాతమంచిర్యాల: పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే వివిధ పార్టీలు భావిస్తున్నాయన్నారు. సమావేశంలో సంఘం నాయకులు గజెల్లి వెంకలయ్య, రాజేశంగౌడ్, బోడంకి మహేష్, కొత్తకొండ రమేష్, గగ్గూరీ రాజన్న, జంబోజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్